

పశ్చిమ డెల్టాకు పూర్వ వైభవం

» రూ. 200 కోట్లతో ప్రతిపాదనలు » నాబార్డు నుంచి నిధులు వచ్చే అవకాశం

» ఈ నిధులతో పూడిక తొలగింపు, గట్లు పటిష్ఠత పనులు



పాత వయ్యేరు కాల్వలో పేరుకుపోయిన తూడు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జలవనరుల శాఖకు మంచి రోజులు వస్తున్నాయి. పశ్చిమడెల్టాకు సాగునీరు, ముంపు సమస్యలు లేకుండా కాలువలు, డ్రెయిన్‌ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. జిల్లాకు రూ.200 కోట్లు అవసరం కానున్నాయని అంచనా వేసింది. జలవనరుల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. నాబార్డు నుంచి నిధులు మంజూరు కానున్నాయి. అదే జరిగితే పశ్చిమడెల్టా రైతుల కష్టాలు తొలగిపోతాయి. కాలువలు అస్తవ్యస్తంగా ఉండడంతో ఈ ఏడాది అధిక వర్షాలకు రైతులు ఇబ్బందులు పడ్డారు. నారుమళ్ల దశ నుంచి ముంపుబెడదను ఎదుర్కొన్నారు. నష్టాలను చవిచూశారు. అప్పటికప్పుడు ప్రభుత్వం తూడు, గుర్రపు డెక్క తొలగింపుతో ముంపు సమస్యను కొంతమేర నివారించారు. శాశ్వత పరిష్కారానికి నాబార్డు నిధులతో పనులు చేపట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. పంట, మురుగు కాలువల్లో పూడిక తీత, గట్లు బలోపేతం చేయడం, అవసరమైన రివిట్ మెంట్ వాల్స్ నిర్మించడం, స్లూయిస్‌లు, లాకులను ఏర్పాటు చేయడం వంటి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నాబార్డ్ నుంచి నిధులు మంజూరుకోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు చేస్తోందని అధికారులు చెబుతున్నారు. నిధులు వచ్చినట్టయితే వేసవి నుంచే పనులు చేపట్టే అవకాశం ఉంటుంది. లేదంటే ఈ ఏడాదికి ఓ అండ్ ఎం నిధులతో వేసవి పనులు పూర్తి చేయనున్నారు.

కూటమి రాకతో ఆశలు

తెలుగుదేశం కూటమి రాకతో రైతులు ఆశలు చిగురించాయి. అధికారులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. వర్షా కాలంలోనూ పనులు చేపట్టే పరిస్థితి ఏర్పడింది. అధిక వర్షాలతో ముంపును గట్టెక్కించేందుకు రూ. 8 కోట్లతో డెల్టాలో డ్రెయిన్‌ల పూడికను తొలగించారు. తాత్కాలిక పనులు చేపట్టారు. యుద్ధప్రాతిపదికన తూడు, గుర్రపు డెక్క తొలగించారు. ముంపు నివారణకు చర్యలు తీసుకున్నారు. అప్పటినుంచి జిల్లా జలవనరుల శాఖలో కదలిక వచ్చింది. దానికితోడు నీటి సంఘాలు మళ్లీ ఏర్పాటయ్యాయి. రబీ సీజన్‌లో ఎక్కడ నీటి సమస్య తలెత్తినా తక్షణ చర్యలు చేపడుతున్నారు. డ్రెయిన్‌లకు అడ్డుకట్ట వేసి వరి చేలకు నీటిని సరఫరా చేస్తున్నారు. డ్రెయిన్‌లలో పూడిక తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నీటి పంపిణీ సంఘాల ఛైర్మన్‌లు పనులు దగ్గరుండి నిర్వహిస్తున్నారు. జిల్లాలో జలవనరుల శాఖ మంత్రి ఉండడంతో అధికారులు మరింత అప్రమత్తంగా ఉంటున్నారు. నిధులకు డోకా లేదన్న భరోసా కాంట్రాక్టర్‌లలోనూ ఏర్పడింది. అందుకు తగ్గట్టుగానే అధికారులు ప్రణాళికలు చేస్తున్నారు. తాజాగా రూ. 200 కోట్లతో పనులు చేపట్టే ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు.

పూడుకు పోయిన డ్రెయిన్‌లు

గత ప్రభుత్వంలో జలవనరుల శాఖకు పైసా నిధులు మంజూరు చేయలేదు. ఎన్నికల ముందు హడావుడి చేశారు. ప్రతిపాదనలు పంపాలని అధికా రులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వంపై విశ్వసనీ యత లేకపోవడంతో అధికారులే ప్రతిపాదనలు పంపేందుకు సుముఖత చూపలేదు. దానికి కారణం లేకపోలేదు. గడచిన ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వం వేసవి పనులను కూడా సక్రమంగా చేపట్టలేక పోయింది. నిధులు విడుదల చేయలేదు. రైతులు చెల్లించే నీటి తీరువా నిధులను కూడా విడుదల చేయలేదు. కాంట్రాక్టర్‌లకు బిల్లులు చెల్లించలేదు. వేసవిలో పూడిక తీత, తూడు, గుర్రపు డెక్క పనులను చేపట్టలేకపోయారు. కాంట్రాక్టర్‌లు పనులు చేయడానికి ముందుకు రాలేదు. టెండర్‌లు వేయ లేదు. ఇలా ఐదేళ్ల పాటు జిల్లాలో అధికారులు అగ్ని పరీక్షను ఎదుర్కొన్నారు. కనీస పనులు చేపట్టలేక పోతున్నామన్న ఆవేదన జలవనరుల శాఖ అధికారుల్లో నెలకొంది. వైసీపీ హయాంలో పిడికెడు మట్టి తొలగించలేకపోయారు. డ్రెయిన్‌లు దారుణంగా పూడుకు పోయాయి. కొద్దిపాటి వర్షాలు కురిసినా సరే డ్రెయిన్‌లు ఎగదన్నుతున్నాయి. పంట పొలాలు ముంపు బారిన పడుతున్నాయి. రైతులకు నష్టాలు తెచ్చిపెడుతున్నాయి.



నిర్లక్ష్యానికి స్పాట్

ఇంటర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకనంలో పొరపాట్లు

విద్యార్థులకు అగచాట్లు

అధ్యాపకుల అశ్రద్ధపై ఇంటర్ బోర్డు చర్యలు

షోకాజ్ నోటీసులు.. అపరాధ రుసుం

ఏలూరు అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఆదమరిచి ఉంటే జరిగే నష్టం ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి ఇదో నిదర్శనం. గత విద్యా సంవత్సరం (2023-24)లో జరిగిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనంలో కొందరు అధ్యాపకులు నిర్లక్ష్యంగా పేపర్లను దిద్దటంతో రెగ్యులర్, అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో పలువురు విద్యార్థులు ఫెయిల్ కావడమో లేదా మార్కులు తక్కువగా పడటమో జరిగిపోయాయి.ఆయా సబ్జెక్టుల్లో రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌లకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల జవాబు పత్రాలను నిపుణులతో కూడిన కమిటీతో పరిశీలన చేయించగా జిల్లాలో స్పాట్ వాల్యుయేషన్ విధుల్లో పాల్గొన్న అధ్యాపకుల్లో కొందరు చేసిన పొరపాట్లు బహిర్గతమయ్యాయి. దీంతో కొందరు విద్యార్థులకు జరిగిన నష్టాన్ని ఇప్పటికే భర్తీచేసిన ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు తాజాగా సంబంధిత మూల్యాంకన విధుల్లో పాల్గొన్న అధ్యాపకులను గుర్తించి వారికి షోకాజ్ నోటీసులు జారీచేయడంతో పాటు, మూల్యాంకనంలో చేసిన తప్పిదాలకు అపరాధ రుసుం విధించారు. ఈ నోటీసులు గత డిసెంబరులో సంబంధిత అధ్యాపకులకు జారీచేసి, వారిపై దాదాపు రూ.లక్ష జరిమానా విధించిన విషయం ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఈ నోటీసులు, పెనాల్టీలను ఇంటర్‌బోర్డు కార్యాల యవర్గాలు ధ్రువీకరించాయి. ఆ ప్రకారం గతేడాది మార్చిలో జరిగిన ఇంటర్ రెగ్యులర్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనంలో 25 మంది అధ్యాపకులకు, ఫలితాలు వెలువడిన తర్వాత జరిగే అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఆన్సర్ స్క్రిప్టులను మూల్యాంకనం చేసిన అధ్యాపకుల్లో 27 మందికి షోకాజ్ నోటీసులు జారీచేసి, వారుచేసిన తప్పిదం తీవ్రత, మోతాదును బట్టి మొత్తం రూ.లక్షవరకు జరిమానా విధించారు. ఈ మొత్తంలో ఇంతవరకు రూ.90 వేల వరకు ఆన్‌లైన్ విధానంలో ప్రభుత్వానికి ఆయా అధ్యాపకులు చెల్లించారు. ఇలా మూల్యాంకన విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహ రించిన వారిని ఏడాది పాటు పరీక్షల విధులకు, స్పాట్ విధులకు దూరంగా ఉంచాలని నిబంధనల మేరకు అధికారులు నిర్ణయించడం గమనార్హం. ఇలా ఇంటర్‌బోర్డు బ్లాక్‌లిస్టులో పెట్టిన అధ్యాపకుల్లో స్క్రూటినైజర్లు, ఎగ్జామినర్లు, చీఫ్ ఎగ్జామినర్లు వున్నట్టు సమాచారం. కాగా రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కోసం ఆయా సబ్జెక్టుల జవాబు పత్రాలకు నిర్ణీత రుసుంను చెల్లించి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పునఃమూల్యాంకనంలో మార్కులు పెరగడం, ఫెయిలైన పలువురు పాస్‌కావడం విశేషం.

అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా పురపాలక సంఘానికి సంబంధించి ఐదు ఎకరాల విలువైన స్థలం రికార్డులకే పరిమితమైంది. కొనుగోలు చేసి 11 ఏళ్లు దాటినా నేటికి ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోలేదు. కనీసం భూమి రక్షణకు ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయలేదు. రికారుల్లో మాత్రం పురపాలక ఆస్తిగా చూపించి చేతులు దులుపుకున్నారు. ఫలితంగా ఈ భూమిపై కొంతమంది కన్ను పడింది. ఇప్పటికే ఈ భూమిలో కొంతభాగం పేదలకు పట్టాలిచ్చారని కొందరు, మరికొందరికి సాగు చేసుకునేందుకు ఇచ్చేస్తారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో పురపాలక అధికారులు, పాలకులు ఈ స్థలాన్ని ఏ విధంగా తిరిగి స్వాధీనం చేసుకుంటారన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

ఆ.. ఐదెకరాల స్థలం ఎక్కడ?



» డంపింగ్‌యార్డు కోసం 2014లో వేములదీవిలో కొనుగోలు

» అప్పటి నుంచి ఈ భూమి రికార్డులకే పరిమితం

» నేటికీ స్వాధీనం చేసుకోని పురపాలక సంఘం

» గతంలో ఈ భూమిలో వైసీపీ నాయకుడు ఆక్వా సాగు

నరసాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘానికి డపింగ్‌యార్డుకు స్థలం లేకపోవడంతో గోదావరి ఒడ్డున చెత్తను వేస్తూ వచ్చింది. దీని వల్ల నదీ జాలాలు కలుషితం, పరిసర ప్రాంతం ఇబ్బందులుపడటంతో మరోచోట స్థలాన్ని కొనుగోలు చేయాలని 2014లో కౌన్సిల్ నిర్ణయించింది. 2015 పుష్కరాలు నాటికి గోదావరి ఒడ్డున ఉన్న చెత్తను తొలగించి కొత్తగా కొనుగోలు చేసిన స్థలంలో వేయాలని అప్పటి పాలకులు, అధికారులు భావించారు. అప్పటికే పురపాలక సంఘం వద్ద 12వ ఆర్థికసంఘం నిధులు ఉండటంతో ఈమొత్తాన్ని రెవెన్యూ అధికారులకు స్థలం నిమిత్తం అప్పగించారు. అప్పటి ఉమ్మడి జిల్లాకు సిద్ధార్థ జైన్ కలెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. పురపాలక అభ్యర్థన మేరకు కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఇచ్చారు. మండలంలోని వేములదీవి గ్రామంలో ఆర్‌ఎస్ నెంబర్ 826/2 సర్వే నెంబర్‌లో దాదాపుగా 14 ఎకరాలు స్థలం ఉందని భావిస్తున్నారు. ఇందులో ఐదు ఎకరాల స్థలాన్ని పురపాలకానికి కేటాయించారు. ఎకరానికి రూ.5.25లక్షలుగా ధర నిర్ణయించారు. ఈస్థలం గ్రామకంఠంకు సంబంధించింది. ఈ స్థలం కొనుగోలుకు కౌన్సిల్ 18479సీఆర్ నెంబర్‌తో తీర్మానం చేసింది. 15-6-2014న ఈస్థలం పురపాలక సంఘానికి కేటాయించారు.

రెండు గ్రామాల్లో అభ్యంతరాలు

పట్టణ చెత్తను తీర గ్రామాలకు తీసుకొచ్చి వేయడాన్ని గ్రామస్థులు అడ్డుకున్నారు. దీంతో దర్భరేవు, వేములదీవి గ్రామాల్లో అప్పట్లో పెద్ద ఆందోళననే జరిగింది. దీంతో పురపాలక సంఘం వెనకడుగు వేసింది. కొనుగోలు చేసిన స్థలాన్ని పరిరక్షించుకునేందుకు అప్పటి పురపాలక టౌన్‌ప్లానింగ్ సిబ్బంది చుట్టూ సరిహద్దు రాళ్ళు పాతారు. మళ్లీ అప్పటి నుంచి ఈ స్థలాన్ని పట్టించుకోలేదు. పాలకవర్గం, అధికారులు మారడంతో అంతాఈ స్థలాన్ని మరిచిపోయారు.

కబ్జాకు ప్రయత్నాలు?

హార్బర్, ఆక్వా యూనివర్సిటీలు తీర ప్రాంతంలోనే నిర్మించాలని గత ప్రభుత్వహయాంలో ప్రతిపాదించారు. దీంతో కొందరు ఈ స్థలంపై కన్నేశారు. గత ప్రభుత్వ హయాంలో ఒక వైసీపీ నాయకుడు విలువైన ఈస్థలంలో ఆక్వా సాగు చేశారు. అయితే గ్రామస్థులు అభ్యంతరంతో ఖాళీ చేశారు. ఈక్రమంలో పేదలకు ఇళ్ళపట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం భావించడంతో ఈ స్థలంలో కొంతభూమిని గ్రామంలోని కొందరికి ఇళ్ల పట్టాలుగా కేటాయిం చినట్లు సమాచారం. అయితే ఇంత వరకు ఎవరూ ఇళ్లు నిర్మించలేదు. మరోవైపు ఈ స్థలాన్ని తమకు సాగుకు కేటాయించారని కొంత మంది పట్టాలు చేతపట్టుకుని అధికారులు, నేతల చుట్టూ తిరుగుతున్నారు. మరోవైపు ఈ స్థలాన్ని లీజ్‌కు ఇచ్చేందుకు గ్రామంలోని కొంత మంది పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ భూమి ఆక్వా సాగుకు అనుకూలమైంది. యూనివర్సిటీ, హార్బర్ ఈ ప్రాంతానికి వస్తే ధర లక్షల్లో పలుకుతుంది. ఇప్పటికైన పురపాలక అధికారులు మేలుకుని విలువైన ఈస్థలాన్ని రక్షించుకుంటారో...లేదో వేచిచూడాలి

గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పుతో తెరమీదకు...

అప్పటి నుంచి పురపాలక సంఘం మళ్లీ చెత్తను గోదావరి ఒడ్డునే వేస్తూ వచ్చింది. దీనిపై స్థానికులు ఇటీవల గ్రీన్‌ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడంతో కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈక్రమంలో పురపాలక సంఘం మంగళగుంటపాలెంలో కొనుగోలు చేసిన స్థలంలో చెత్తవేసేందుకు ప్రయత్నించింది. అక్కడ కూడా ప్రతిఘటనలు ఎదురయ్యాయి.ఈ నేపథ్యంలో కొందరు మాజీ కౌన్సిలర్లకు వేములదీవిలో 11 ఏళ్ళక్రితం కొనుగోలు చేసిన స్థలంపై ఆరా తీయడం మొదలుపెట్టారు. దీంతో పురపాలక సంఘం అధికారులు ఆస్థలానికి రికార్డులు బయటకు తీశారు. ఇలా గతంలో కొనుగోలు చేసి తెరమీదకు వచ్చింది.



మా దృష్టికి వచ్చింది

అంజయ్య, కమిషనర్, నరసాపురం

11ఏళ్ళ క్రితం డపింగ్‌యార్డు నిమిత్తం పురపాలక సంఘం వేములదీవిలో ఐదు ఎకరాల స్థలం కొనుగోలు చేసిన విషయం ఇటీవల నా దృష్టికి వచ్చింది. రికార్డులు పరిశీలిస్తున్నాం. స్థలం మాది అయితే రక్షణ చర్యలు చేపడతాం

హాస్టల్స్‌కు వసతులు

రూ.కోటీ 29 లక్షలు విడుదల



భీమవరం టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరయ్యాయి. జిల్లాలోని అనేక వసతి గృహాల్లో కనీస వసతులు కల్పనకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రత్యేక దృష్టిపెట్టారు. కలెక్టర్ ఇటీవల పలు వసతి గృహాలను సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న వసతులను పరిశీలించారు. జిల్లాలో 35 వసతి గృహాలు ఉండగా అందులో 22 సొంత భవనాలు ఉన్నాయి. ఇందులో అవసరమైన వసతుల కల్పనకు కోటి 29 లక్షల రూపాయల నిధులను మంజూరు చేశారు. ఈ పనులను చేపట్టేందుకు గృహనిర్మాణ శాఖకు బాధ్యతలు అప్పగించారు. గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మరుగుదొడ్లు, ప్రహరీ, విద్యుత్, కిచన్, రూమ్‌ల్లో మరమ్మతులను చేపట్టనున్నారు. వీటి పురోగతిని కూడా ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్‌కు అందించనున్నారు. నిధులు సరిపోకపోతే మరిన్ని నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ నాగరాణి ఇప్పటికే స్పష్టం చేశారు. తల్లిదండ్రులను వదలి విద్యను అభ్యసించేందుకు వచ్చిన వారికి అన్ని సౌకర్యాలు కల్పించి అండగా ఉండాలన్నదే లక్ష్యమని ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిధులు మంజూరు కావటంతో ప్రతిపాదించిన పనులను వెంటనే చేపట్టాలే చర్యలు తీసుకుంటున్నారు. రానున్న రోజుల్లో వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు లేవనే వార్తలు రాకుండా పూర్తి స్థాయిలో చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

గట్టుకు మోక్షం ఎప్పుడో..?

» ఏడాదిగా ఎక్కడి పనులు అక్కడే

» అదనపు నిధుల కోసం ఎదురుచూపు

7

అంగన్‌వాడీ పిల్లలకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

భీమవరం టౌన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్వాడి పిల్లల నమోదుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక మొబైల్ ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లాలోని అన్ని అంగన్వాడి కేంద్రాల్లో నమోదైన ఆరు ఏళ్ళలోపు పిల్లలకు కొత్త ఆధార్ కార్డు నమోదు చేయడానికి ప్రత్యేక మొబైల్ ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 21నుంచి 24 వరకు, 27 నుంచి 30 వరకు అంగన్వాడి కేంద్రాల్లో శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అంగన్వాడి వర్కర్లు ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, సీడీపీవోలు అంగన్వాడి కేంద్రాల్లోని పిల్లల తల్లిదండ్రులకు తెలియజేసి అవసరమైన ధృవ పత్రాలతో ప్రత్యేక ఆధార్ శిబిరంలో కొత్త ఆధార్ కార్డులకు నమోదు చేసుకొనేలా ప్రోత్సహించాలన్నారు. మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు నూరు శాతం కొత్త ఆధార్ కార్డుల నమోదుకు చర్యలు తీసు కోవాలన్నారు. ఆచంట మండలంలో -2, ఆకి వీడు మండలంలో -4 అత్తిలి మండలంలో -3 భీమవరం-6 యలమంచిలి-4 గణపవ రం-5, ఇరగవరం-3, కాళ్ళ-4 మొగల్తూరు-4 నరసాపురం-3, పాలకొల్లు-3, పాలకోడేరు-3, పెనుగొండ-3, పెనుమంట్ర-3 పోడూరు-4, తాడేపల్లిగూడెం-3, తణుకు-6, ఉండి-3, వీరవాసరం-4 ఆధార్ కేంద్రాలను, అర్బన్ మండలాల్లో భీమవరం-4 నరసాపురం-4 పాలకొల్లు-3, తాడేపల్లిగూడెం-3, తణుకు-6ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.



భీమవరం మండలంలో దాళ్వా సాగు కోసం దమ్ము చేస్తున్న దృశ్యం

వ్యవసాయంలో యంత్ర పరికరాలు కీలకం

సబ్సిడీ పనిముట్ల కోసం రైతుల ఎదురుచూపు

ఐదేళ్లుగా రైతులకు అందని వైనం

భీమవరం రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): దాళ్వా సాగులో పంటల బీమాను తీసుకురావడం రైతులకు సాగులో భరోసానిచ్చింది. అయితే సాగులో కీలక పాత్రగా నిలుస్తున్న వ్యవసాయ యాంత్రిక పనిముట్ల సబ్సిడీ కోసం మాత్రం రైతులు ఎదురు చూస్తున్నారు. పనిముట్ల ధరలు అధికంగా పెరిగిపోవడం రైతులకు భారంగా మారింది. ఈ తరుణంలో సబ్సిడీ తప్పనిసరి అనిపిస్తుంది. గడిచిన ఐదేళ్లలో వ్యక్తిగతంగా రైతులు పనిముట్లకు సబ్సిడీ పొందలేకపోయారు. టార్పాలిన్ నుంచి పురుగు మందు పిచికారీ యంత్రం.. చిన్న ట్రాక్టర్ వరకు ఏ పనిముట్లకు సబ్సిడీ అందుకోలేకపోయారు. సబ్సిడీ లేనందున 90 శాతం మంది రైతులు పనిముట్లు కొనుగోలుకు వెళ్ళలేకపోయారు. అందు వలన కూటమి ప్రభుత్వంలో సబ్సిడీ పనిముట్లు అందు బాటులోకి వస్తాయన్న ఆలోచనలో రైతులు ఉన్నారు.

పనిముట్ల సబ్సిడీకి ఏటా రూ. 25 కోట్లు

వ్యవసాయంలో ఉపయోగించే యాంత్రిక పనిముట్లకు సబ్సిడీ ఇవ్వడం ఆనవాయితీగా వచ్చేది. ఏడాదికి పనిముట్ల సబ్సిడీకి బడ్జెట్ కూడా కేటాయించేవారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో 2014 నుంచి 2019 వరకు ఉమ్మడి జిల్లాకు ఏడాదికి రూ.25 కోట్లు కేటాయిస్తూ వచ్చింది. ఐదేళ్లలో రూ.125 కోట్లు బడ్జెట్ ఇచ్చారు. అప్పట్లో టార్పాలిన్ నుంచి పెద్ద ట్రాక్టర్ కూడా సబ్సిడీ అందించారు. వరికోత యంత్రానికి ఏకంగా రూ.10 లక్షలు సబ్సిడీ ఉండేది. దాని వల్ల రైతులు వ్యవసాయంలో యంత్రీకరణ వైపు మొగ్గుచూపేవారు. గడిచిన ఐదేళ్లలో పనిముట్ల సబ్సిడీ అనే మాట మరవడం రైతులకు పనిముట్లు కొనుగోలు భారంగా మారింది.

పంటల బీమా గడువు పెంపు

ఈ ఏడాది దాళ్వా పంటకు పంటల బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ పంటలో అకాల వర్షాల వల్ల పంటకు నష్టం చేకూరితే బీమా ధీమాగా ఉంటుందని ప్రభుత్వం లెక్క. గతంలోను దాళ్వా పంటలు అకాల వర్షాల వల్ల దెబ్బతినే దాఖలాలు ఉన్నాయి. బీమా ప్రీమియం చెల్లింపు గడువు ఈ నెల 15వ తేదీ వరకు పెంచారు. దీంతో రైతులు చాలా వరకు ప్రీమియం చెల్లించారు. జిల్లాలో 2 లక్షల 25 వేల ఎకరాలు దాళ్వా సాగు సాగయింది. బీమా ప్రీమియం 5436 మంది రైతులు చెల్లించారు.

వ్యవసాయమంతా యాంత్రీకరణ

ఎం.జయపాల్ (రైతు, భీమవరం మండలం)



వరిసాగు దమ్ము నుంచి పురుగు మందు పిచికారీ వరికోత వరకు యాంత్రిక పనిముట్లతోనే జరుగుతుంది. అలాంటి యాంత్రిక పనిముట్లకు సబ్సిడీ ఇస్తే రైతులకు చేయూతగా ఉంటుంది.

త్వరలో అమలు చేస్తాం

వెంకటేశ్వర్లు (జిల్లా వ్యవసాయాధికారి)



వరిసాగులో ఉపయోగించే యాంత్రిక పనిముట్లకు సబ్సిడీని తొందరలోనే అందుబాటులోకి తీసుకువచ్చేలా ఆలోచనలు చేస్తున్నారు. దాళ్వా పంట ప్రీమియంలో కూడా రైతులు బాగా చెల్లించారు.

భీమవరం పురపాలక సంఘము, భీమవరం

ఆర్.ఓ.సి.నెం.3103/2023/జి1. తేది.18.01.2025

పబ్లిక్ నోటీసు

సూచిక : 1) రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రాజమహేంద్రవరం, వారు ఆమోదించిన రహదారి అభివృద్ధి ప్రణాళిక ఆర్.డి.పి.నెం.No.04/2023/R.తేది.27.04.2023. 2) గవర్నమెంట్ మెమో నెం.2250060/M2/2023. తేది:30.10.2023. 3) జి.ఓ.యం.యస్.నెం.04MA&UD, తేది:09.01.2025.

కమీషనర్,భీమవరం పురపాలక సంఘము, భీమవరం వారు మాస్టర్ ప్లాన్ రోడ్డు విస్తరణ లో భాగంగా స్థానిక 33వ వార్డు, డి.ఎన్.ఆర్.కాలేజీ రోడ్డు నుండి లోసరి మెయిన్ ఛానల్ వెస్ట్ బంట్‌రోడ్డును రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్‌టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రాజమహేంద్రవరం వారు ఆమోదించిన రహదారి అభివృద్ధి ప్రణాళిక ఆర్.డి.పి. నెం.04/2023/R, తేది: 27.04.2023 ప్రకారం 40 అడుగుల రోడ్డుగా భీమవరం రెవెన్యూ గ్రామము సర్వే నంబర్లు 439/2(P), 439/4(P),439/7(P),439/10(P), 439/15(P),439/16(P),and440/1A(P),440/2(P), 440/3(P), 440/4(P),లు గుండా పోవుచూ భీమవరం మాస్టర్ ప్లాన్ జి.ఓ.యం.యస్.నెం.981.MA&UD, తేది.27.11.1987లో ఐది తయారు చేయబడినది అందుపై. ప్రస్తుతము ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారు టి.డి.ఆర్.లు ఆమోదము కొరకు నూతన నిబంధనలు జారీచేసియున్నారు.(ప్రభుత్వ మెమో నెం.2250060/M2/2023. తేది:30.10.2023) మరియు జి.ఓ.యం.యస్.నెం.04.MA&UD.తేది: 09.01.2025.

క్రమసంఖ్య	పేరు	సర్వేనెం.	డోర్.నెం.	విస్తీర్ణం చ.గ.లలో	విస్తీర్ణం చ.మీ.లలో
కరణం గారి వీధి ఉత్తరం వైపు ఆస్తి వివరములు					
1	రాష్ట్ర ప్రభుత్వం	439/2	--	25.35	21.2
2	రాష్ట్ర ప్రభుత్వం	439/2	--	8.55	7.15
3	రాష్ట్ర ప్రభుత్వం	439/2	--	65	54.34
4	రాష్ట్ర ప్రభుత్వం	439/2	--	79.21	66.23
5	రాష్ట్ర ప్రభుత్వం	439/2	--	67	56.04
6	లంకపల్లి మహాలక్ష్మి	439/4	24-8-1	57	47.66
7	అయిత వెంకటరత్న సభాపతి	439/7	24-8-7/A	0	0.00
8	అయిత వెంకటరత్న సభాపతి	439/7	24-8-7/A	0	0.00
9	మునికుట్ల రవి కిరణ్	439/7	24-9-1	45	37.63
10	గొట్టుముక్కల లీలావతి	439/10	24-7-1	103.7	86.71
11	గొట్టుముక్కల లీలావతి	439/15	24-7-9	71.11	59.46
12	పెన్మత్స పాండురంగ రాజు	439/15	24-9-2	47.77	39.94
13	తంపర్తి వెంకట వినేష్	439/15	24-14-96	51.67	43.20
కరణం గారి వీధి దక్షిణం వైపు ఆస్తి వివరములు					
1	రౌతు రమేష్	440/1	24-10-11	36	30.10
2	రౌతు అన్నపూర్ణ	440/1	24-9-31/1	33	27.59
3	రౌతు అప్పారావు	440/1	24-9-18	32.66	27.31
4	సుభద్ర టవర్స్	440/1	24-9-18	25.73	21.51
5	ఉద్దరాజు నరసింహ రాజు	440/2	24-9-16	42.22	35.30
6	డి.విజయలక్ష్మి	440/2	24-11-12	57.16	47.79
7	గొట్టుముక్కల గోపాల కృష్ణం రాజు	440/3	24-9-70	65.08	54.42
8	మంతెన వెంకట శివ కుమార్	440/3,4	24-9-70	21.86	18.28
9	ముదునూరి విజయ భారతి	440/4	24-9-70	5.45	4.56
10	గొట్టుముక్కల గోపాల కృష్ణం రాజు	440/4	24-9-70	5.45	4.56
11	మంతెన నారాయణ రాజు & దంతులూరి సుశీల	440/4	24-9-70	59.16	49.47
12	గాదిరాజు పద్మలీల	440/4	24-9-70	43.72	36.56
13	దంతులూరి సుశీల, మంతెన నారాయణ రాజు గాదిరాజు పద్మలీల	440/4	24-9-70	10.76	9.00
14	గొట్టుముక్కల లీలావతి	440/4	24-9-4	25.73	21.51
15	గొట్టుముక్కల లీలావతి	440/4	24-9-5	41.11	34.37
16	దంతులూరి శ్రీరామరాజు	440/4	24-14-8/1	37.77	31.58
17	దంతులూరి నారాయణ రాజు	440/4	24-14-8/2	108.88	91.04

డి.ఎన్.ఆర్.కాలేజీ రోడ్డు నుండి లోసరి మెయిన్ ఛానల్ వెస్ట్ బంట్ రోడ్డు వరకు టి.డి.ఆర్.జారీ కొరకు 40'-0" మాస్టర్ ప్లాన్ రోడ్డు విస్తరణలో పైన తెల్పిన ఆస్తులు ప్రభావితమగుచున్నవి.

ప్రభుత్వము వారు నూతనముగా సవరించిన నిబంధన ప్రకారము స్థానిక 33వ వార్డు, డి.ఎన్.ఆర్. కాలేజీ రోడ్డు నుండి లోసరి మెయిన్ ఛానల్ వెస్ట్ బంట్ రోడ్డు (పొడవు 0.233కి.మీ.)ను రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్‌టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రాజమహేంద్రవరం వారు ఆమోదించిన రహదారి అభివృద్ధి ప్రణాళిక ఆర్.డి.పి.నెం.04/2023/R, తేది: 27.04.2023 ప్రకారం 40 అడుగుల రోడ్డు (భీమవరం రెవెన్యూ గ్రామము సర్వే నెంబర్లు 439/2(P), 439/4(P), 439/7(P), 439/10(P),439/15(P),439/16(P),and440/1A(P),440/2(P),440/3(P),440/4(P),వెడల్పు చేయుటలో కోల్పోయిన నిర్వాసితులకు టి.డి.ఆర్. ఇచ్చు విషయమై ఏదైనా అభ్యంతరములు/సూచనలు ఉన్న యెడల ఈ నోటిఫికేషన్ వెలువడిన తేది నుండి 7 రోజులలోపు భీమవరం పురపాలక సంఘము వారికి తెలియజేయవలెను. అభ్యంతరములు/సూచనలు మొదలగునవి లేని యెడల పై సూచించిన వ్యక్తులకు/ఆస్తి యజమానులకు టి.డి.ఆర్. ఇచ్చు విషయమై నిబంధనల ప్రకారం ఆమోదించబడునని తెలియజేయడమైనది.

కమీషనర్

భీమవరం పురపాలక సంఘము

నేత్రపర్వం.. తిరువీధిసేవ



ద్వారకాతిరుమల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్రంలో ద్రవిడ ప్రబంధ అధ్యయనోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. ముక్కోటి పర్వదినం మొదలుగా ఈ ఉత్సవాలను పదిరోజుల పాటు జరపడం ఇక్కడ సాంప్రదాయబద్ధమైంది. అధ్యయనోత్సవంలో భాగంగా ఆదివారం సాయంత్రం ఉభయ దేవేరులతో స్వామివారిని తొళక్క వాహనంపై ఉంచి నిత్యకల్యాణ మండప ఆవరణలోకి తెచ్చారు. మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై ఉంచిన బంగారు సింహాసనంపై ఉత్సవమూర్తు లను ఉంచి విష్వక్సేనపూజ, పుణ్యహావచనను అర్చకులు జరిపారు. అనంతరం నవకలశస్నపన, అభిషేకాలను నిర్వహించారు. ఆ తరువాత తిరుమంజనాలు జరిపి స్వామి, అమ్మవార్లకు హారతులిచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు, పండితులు సేవాకాలాన్ని జరిపి భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ జరిపారు. ఆతర్వాత శ్రీవారి తిరువీధిసేవ క్షేత్రంలో వైభవంగా జరిగింది.

గట్టుకు మోక్షం ఎప్పుడో..?



మధ్యస్థంగా నిలిచిన ఏటిగట్టు పనులు

- ఏడాదిగా ఎక్కడి పనులు అక్కడే
- అదనపు నిధుల కోసం ఎదురుచూపు

నరసాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి ఆనుకుని కోతకు గురైన ఏటిగట్టు పనులు ఏడాదిగా మధ్యస్థంగా నిలిచిపోయాయి. అమరేశ్వరస్వామి ఆలయం నుంచి పొన్నపల్లి రేవు వరకు సుమారు 400 మీటర్ల మేర పని చేపట్టాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు 300 మీటర్ల పూర్తి చేశారు. ఇంకా 100 మీటర్ల పనులు జరగాల్సి ఉంది. ఏడాదిగా మధ్యస్థంగా పనులు నిలిచిపోవడంతో గట్టుమీద వాహనాలు వెళ్లే మార్గం లేకుండా పోయింది.

గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.25కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. గతంలో ఉన్న గట్టు వెడల్పును పెంచారు. పనుల ప్రారంభంలో పలు మార్లు గట్టు జారిపోతూ వచ్చింది. దీనిపై అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ, జనసేనలు పలు మార్లు ఉద్యమాలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపించారు. నాణ్యమైన రాళ్లతో గట్టు పటిష్ఠ పనులు జరగడం లేదని, దీనిపై విజిలెన్స్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీలు చేపట్టాలని అప్పటి గవర్నర్, ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు ఆచంట బహిరంగ సభలో ఏటిగట్టు అవినీతిపై ప్రస్తావించారు. తాము అధికారంలోకి వస్తే విచారణ చేయిస్తామని అన్నారు. ఈ నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం ఇంజనీరింగ్ చీఫ్ అధికారుల బృందాన్ని నరసాపురం పంపింది. అధికారులు పనుల్ని పరిశీలించారు. టెక్నికల్ ఇంజనీర్ల సూచనలతో పనుల్ని మొదలు పెట్టి 300 మీటర్ల వరకు గట్టు పనులు పూర్తి చేశారు. మళ్లీ అప్పటి నుంచి జార లేదు. ఇటీవల వరదలకు కూడా బలంగానే నిలబడింది. ఈనేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న 100 మీటర్ల పనుల్ని కూడా పూర్తి చేయాలని ప్రభుత్వానికి నివేదించారు. ఇందుకు మరో రూ.4 కోట్లు ఖర్చు అవుతుందని ప్రతిపాదనలు పంపారు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పనులకు గ్రీన్ సిగ్నల్ రాలేదు. దీంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. దీనిపై ఏటిగట్టు శాఖ ఏఈ సుబ్బారావు వివరణ ఇస్తూ.... చేపట్టిన గట్టు పనులు పటిష్ఠంగానే ఉన్నాయన్నారు. ఇటీవల వరదలకు కూడా కృంగ లేదన్నారు. ఇంకా 100 మీటర్ల పెండింగ్ ఉంది. నిధులు విడుదల కాగానే పనులు పూర్తి చేస్తామన్నారు.

నేడు ఆచంట పోలీసు స్టేషన్ భవనం ప్రారంభం

డీజీపీ ద్వారకాతిరుమల రావు రాక



నూతన భవనంలో రూమ్‌లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పితాని, ఎస్పీ నయీం అస్మి, డీఎస్పీ శ్రీవేద తదితరులు

ఆచంట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆచంటలో నూతనంగా నిర్మించిన పోలీసు స్టేషన్ భవనాన్ని సోమవారం ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పరిశీలించారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ భవనం ప్రారంభానికి అనేక మంది ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారని, అందువల్ల పోలీసు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ భవన ప్రారంభోత్సవానికి డీజీపీ ద్వారకాతిరుమల రావు కూడా హాజరవుతున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ బొర్రా గురుమూర్తి, నరసాపురం డీఎస్పీ డాక్టర్ శ్రీవేద, సీఐ రాయుడు విజయ కుమార్, ఎస్ఐ కట్టా వెంకటరమణ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



సూపర్ సీనియర్స్ చేగొండి వెంకట హరిరామ జోగయ్య, అల్లు వెంకట సత్యనారాయణ, డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జీ)లను సత్కరిస్తున్న మంత్రి నిమ్మల

సీనియర్ల బాటలో అభివృద్ధికి కృషి చేస్తా

- మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్ /టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించి అభివృద్ధికి బాటలు వేసిన నేతలు చేగొండి హరిరామజోగయ్య, అల్లు వెంకట సత్యనారాయణ, డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జీ)ల బాటలో పయనిస్తానని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. లయన్స్ క్లబ్ హాల్లో ఆదివారం రాత్రి జరిగిన సీనియర్ సిటిజన్ల సంఘ సమావేశంలో ముఖ్యఅతిథిగా మంత్రి నిమ్మల పాల్గొని మాట్లాడారు. సభకు సంఘ అధ్యక్షుడు వంగా నరసింహారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర సీనియర్ సిటిజన్ల సంఘ అధ్యక్షుడు వెంపరాల సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రం ప్రగతి పథంలో వందే భారత్ రైలు మాదిరిగా పరుగులు తీస్తోందని అన్నారు, పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణాలు, విశాఖ ఉక్కు, రైల్వే జోన్ వంటి వాటితో దేశంలో వేగంగా అభివృద్ధి చెందే రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉందన్నారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు చేగొండి హరిరామ జోగయ్య, అల్లు వెంకట సత్యనారాయణ, డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జీ) లను ఘనంగా సత్కరించారు. ముందుగా సీనియర్ సిటిజన్లు అయిన కళాకారులు రాజా తాతయ్య, ఐ వెంకటేశ్వరరావు, సీవీవీ సత్యనారాయణ మూర్తి, వీఎస్ఎన్ మూర్తి, సీహెచ్ ప్రసాద్, దుర్గా పాలేశ్వరి తమ కళలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి జీఎస్ఎన్ మూర్తి, వై.వెంకట రత్నం, జిల్లా సంఘ అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, చాంబర్ అధ్యక్షుడు కేవీఆర్ నరసింహరావు, వీవీ తిరుపతిరాజు మాట్లాడారు. కార్యక్రమంలో అత్యం ఆదిశేషయ్య, వంగా శేషారావు, కె సూరిబాబు, కె.రవిశంకర్, కర్నేన గౌరునాయుడు, గుండా రామకృష్ణ, ముత్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బైక్, కార్లకు లైఫ్ టాక్స్ మినహాయింపు

జిల్లా రవాణా అధికారి ఉమామహేశ్వరరావు

భీమవరంక్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ బైకులు, కార్లకు జీవిత పన్ను (లైఫ్ టాక్స్) మినహాయింపు అవకాశాన్ని జిల్లాలో నూతన విద్యుత్ వాహన కొనుగోలుదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు కోరారు. 2019కి ముందు విద్యుత్ వాహనాలు కొనుగోలుపై అమలు కాబడిన జీవిత పన్ను మినహాయింపుని రాష్ట్ర ప్రభుత్వం మరలా ఈ నెల నుంచి అమలులోకి తీసుకొచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కాలుష్యం రోజురోజుకు తీవ్రమవుతున్న దృష్ట్యా, వాయు కాలుష్య నియంత్రణ చర్యలలో భాగంగా ప్రభుత్వం విద్యుత్ వాహనాల ద్వారా కాలుష్యం తగ్గించవచ్చుని సమీక్ష చేసి, విద్యుత్ బైకులు, కార్లకు జీవిత పన్ను మినహాయింపు మరల అమలులోకి తీసుకురావడం జరిగిందన్నారు. మన రాష్ట్రంలో కొనుగోలు చేసిన, రిజిస్టర్ చేసుకున్న అన్ని స్వచ్ఛమైన ఎలక్ట్రిక్ వాహనాలపై పన్నును మినహాయిస్తూ ఐదు సంవత్సరాల కాలం పరిమితికి జనవరి 2025 నుంచి జనవరి 2030 వరకు అమలులో ఉండేలా ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని తెలిపారు పన్ను మినహాయింపు స్వచ్ఛమైన ఎలక్ట్రిక్ వాహనాలకు మాత్రమే వర్తిస్తుందని, హైబ్రిడ్ వాహనాలకు వర్తించదన్నారు. అలాగే ఇతర రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ టి.ఆర్ జారీ చేసిన వాహనాలకు, ఆంధ్రప్రదేశ్‌లోని డీలర్లు ఇతర రాష్ట్రాలకు టి.ఆర్‌లు జారీచేసిన లైఫ్ టాక్స్‌మినహాయింపు వర్తించదని తెలిపారు. కావున రాష్ట్రం వెలుపల ఎలక్ట్రిక్ టి.ఆర్ పట్ల విద్యుత్ వాహన కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు.

నేటి నుంచి కోలమూరులో సురభి నాటకోత్సవాలు

ఉండి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20వ తేదీ నుంచి 23 వరకు కోలమూరులో సురభి నాటకోత్సవాలు నిర్వహిస్తున్నారు. శ్రీసంతాన గోపాలస్వామి ఆలయ కమిటీ ఈ విషయాన్ని తెలిపింది. 20వ తేదీ రాత్రి 7గంటలకు మాయబజార్ పౌరాణిక నాటకం, 21వ తేదీ రాత్రి శ్రీకృష్ణలీలలు పౌరాణిక నాటకం, 22వ తేది రాత్రి లవకుశ పౌరాణిక నాటకం, 23వ తేదీ రాత్రి శ్రీనివాసకల్యాణం పౌరాణిక నాటకాలు ప్రదర్శింపబడతాయని తెలిపారు. ఈ నాటకాలను రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణ రాజు ప్రారంభిస్తారని ఆలయకమిటి చైర్మన్ నంబూరి బదిరీనారాయణరాజు, కార్యనిర్వహణాధికారి మంతెన రామరాజు తెలిపారు.

నేటి నుంచి సదరం సర్టిఫికెట్ల పరిశీలన

తణుకు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో నేటి నుంచి సదరం సర్టిఫికెట్లు పరిశీలించనున్నారు. జిల్లాలోని లబ్ధిదారులు తణుకు కేంద్ర ఆసుపత్రికి రావాల్సి ఉంటుంది. ఇందుకోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. వైసీపీ హయాంలో ఇబ్బడి ముబ్బడిగా సదరం సర్టిఫికెట్లను జారీ చేశారు. అప్పట్లో అనర్హులు సర్టిఫికెట్లు పొందుతున్నారనే ఆరోపణలు వచ్చాయి. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో సుమారు 14 వేల మంది లబ్ధిదారుల సర్టిఫికెట్లను వైద్యులు పరిశీలించి వైకల్యం నిర్ధారించాల్సి ఉంది. ఇతర ప్రాంతాల ఆస్పత్రుల నుంచి ప్రత్యేక వైద్యులను నియమించారు. ప్రత్యేక శిబిరాలు సోమ, మంగళ, బుధవారాల్లో ఉంటాయి. ఇలా మూడు నెలలు పాటు శిబిరంలో సదరం ప్రత్యేక తనిఖీలు చేస్తారు.

మార్చిలో పాలకొల్లు కళాపరిషత్ నాటిక పోటీలు

పాలకొల్లు అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు కళా పరిషత్ ఆధ్వర్యంలో మార్చి 15, 16, 17 తేదీలలో నాటికల పోటీలు నిర్వహిస్తున్నట్టు సంస్థ అధ్యక్షుడు కేవీ కృష్ణ వర్మ, కార్యదర్శి జక్కంపూడి కుమార్ తెలిపారు. పోటీలకు 8 నాటికలు ఎంపిక చేశామని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ శుక్రవారం అరవింద్ ఆర్ట్స్ తాడేపల్లి వారి విడాకులు కావాలి, ఉషోదయం కళానిలయం కట్రపాడు వారి కిడ్నాప్, 16వ తేదీ ఆదివారం మిత్రా క్రియేషన్ హైదరాబాద్ వారి ఇది రహదారి కాదు, చైతన్య కళా స్రవంతి విశాఖపట్నం వారి అసత్యం, మద్దుకూరి క్రియేషన్స్ చిలకలూరిపేట వారి మా ఇంట్లో మహాభారతం నాటికలు 17వ తేదీ సోమవారం అమరావతి ఆర్ట్స్ గుంటూరువారి చిగురు మేఘం, పండూ క్రియేషన్స్ కొప్పోలు వారి పక్కింటి మొగుడు, నటీ నట సమాఖ్య పాలకొల్లు వారి అనూహ్యం (ప్రత్యేక ప్రదర్శన) నాటికలు ప్రదర్శించబడతాయని కృష్ణ వర్మ, జక్కంపూడి కుమార్ తెలిపారు.

28, 29,30 తేదీల్లో మెగా ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్

టి.నరసాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొర్రంపాలెంలో జరగనున్న మెగా ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్‌కు టీమ్‌లను ఆహ్వానిస్తున్నట్లు టోర్నమెంట్ కన్వీనర్ కె.విజయ్ ఆదివారం తెలిపారు. జడ్పీటీసీ సభ్యులు సామంతపూడి బాల సూర్య నారాయణరాజు (సూరిబాబు) పుట్టినరోజు సందర్భంగా ఈనెల 28, 29,30 తేదీల్లో బొర్రంపాలెంలో మెయిన్‌రోడ్డు పక్కన సూరిబాబు స్థలంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహి స్తున్నట్లు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.50 వేలు, 2వ బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, 4వ బహుమతి రూ.5 వేలు అందిస్తున్నామని తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనే టీమ్‌లు ఈనెల 26 లోపు రూ..500 ఎంట్రీఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వివరాలకు 96766 69597 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

కొబ్బరికాయలు కొట్టే భక్తుల నుంచి అక్రమ వసూళ్లు

ఫిర్యాదు చేసిన ఓ భక్తుడు



సెక్యూరిటీకి ఫిర్యాదు చేస్తున్న భక్తుడు.

ద్వారకాతిరుమల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న ఆలయ ప్రాంగణంలో యాత్రికులు కొబ్బరికాయలు కొట్టే ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు మద్యం సేవించి భక్తులను డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆలయ సెక్యూరిటీకి ఫిర్యాదు అందింది. కొబ్బరి చెక్కలు ప్రోగుచేసుకునే కాంట్రాక్టరు వద్ద పనిచేస్తున్న వీరు ప్రతీరోజూ కొబ్బరికాయలు కొట్టే యాత్రికులను డబ్బు డిమాండ్ చేస్తున్నట్లు చెబుతున్నారు. ఒక్కో భక్తుని నుండి రూ.10 నుంచి రూ.20 వరకూ డబ్బు ఇవ్వకపోతే యాత్రికులను దుర్భాషలాడుతున్నట్లు చెబుతున్నారు. ఈక్రమంలో ఆదివారం పిప్పర నుంచి కుటుంబంతో వచ్చిన ఓ భక్తుడు కొబ్బరి కాయలు కొట్టేందుకు అక్కడకు వచ్చాడు. వారిని డబ్బులు అడిగి ఇవ్వకపోయేసరికి దుర్భాషలాడాడంటూ సెక్యూరిటీకి ఆ భక్తుడు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదును సెక్యూరిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. అక్రమ వసూళ్లకు పాల్పడిన ఇద్దరిలో ఓ వ్యక్తిని స్థానిక పోలీస్టేషన్‌లో అప్పగించారు.

ఆటో బోల్తా : ఒకరికి గాయాలు



ముదినేపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శుక్రవారం రాత్రి ఆటో బోల్తా పడిన సంఘటనలో గురజ గ్రామానికి చెందిన తొందూరు నాగరాజు తీవ్ర గాయాలకు గురయ్యాడు. మచిలీపట్నం నుంచి గురజ గ్రామంలోని చేపల చెరువుల వద్దకు మేత కట్టలు తీసుకొచ్చిన ఆటో తిరిగి ముదినేపల్లి నుంచి మచిలీపట్నం వెళ్తుండగా, జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న గోతుల్లో బోల్తా పడింది. ముదినేపల్లిలో ఆటో ముగ్గురు ఎక్కగా వారిలో నాగరాజు అనే వ్యక్తి ప్రమాదంలో గాయాలకు గురయ్యాడు. వెంటనే పోలీసులు అతనిని 108 వాహనంలో గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తర లించారు.

వివాహిత అదృశ్యం..కేసు నమోదు

ఉండి, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఉండి పోలీసులు తెలిపారు. ఉండి మండలం మహదేవపట్నం గ్రామానికి చెందిన చేపల కనక మహా లక్ష్మీ (28) తనభర్తతో విడిపోయి తల్లిదండ్రులు వద్దే వుంటున్నది. సంక్రాంతి పండుగకు తనకు బట్టలు కొనలేదని తల్లితో గొడవపడి ఈనెల 15న మధ్యాహ్నం బయటకు వెళ్లిపోయింది. బంధువులు, సన్నిహితులు ఇళ్లవద్ద వెదకినా కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి
DAILY CLASSIFIEDS
క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

GOLD FINANCE
- బంగారం కొనబడును, బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం.
(స్పాట్ క్యాష్) సంప్ర: 83338 33368
AJB -225764

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా సొమ్ము చెల్లించినా/ క్లెయిమ్‌లకు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారులతో జరుపు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటి

క్రైమ్ కార్నర్



ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న తిరుపతి కృష్ణ

అల్లరి మూకలు దాడి.. ఒకరికి గాయాలు

ఏలూరు క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : అతి వేగంగా మోటారు సైకిల్ ఎందుకు నడుపుతున్నారంటూ ప్రశ్నించిన ఒక యువకుడిని అల్లరి మూకలు దాడిచేసి గాయపరిచారు. ఏలూరు నగరంలో రాత్రివేళ అల్లరిమూకల జోరు పెరిగిపోయింది. హోటళ్ళు తెల్లవార్లు తెరిచి ఉండడంతో అల్లరిమూకలు నగరంలో బైక్‌లపై చక్కర్లు కొడుతున్నారు. అతి వేగంగా వాహనాలు నడుపుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. శనివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఏలూరులోని నరసింహారావుపేట డిగ్రీ కాలేజీ సమీపంలో ముగ్గురు యువకులు బైక్‌పై అతి వేగంగా చక్కర్లు కొడుతున్నారు. అదే ప్రాంతానికి చెందిన కాళిదాసు, తిరుపతి కృష్ణ వారిని ప్రశ్నించారు. దీంతో అక్కడ గొడవ జరిగింది. అక్కడ ఉన్న కొంత మంది సముదాయించి ఆ యువకులను పంపించి వేశారు. తిరిగి కొంత సమయం తరువాత కొత్తపేట నుంచి మరి కొంతమంది యువకులను తీసుకువచ్చి కర్రలతో, రాడ్లతో తిరుపతిస్వామిపై దాడి చేశారు. దీంతో తీవ్ర గాయాలకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. సన్ని, కొత్తపేటనకు చెందిన సాయి, పవన్, మరో కొంత మంది కలిసి తనపై దాడి చేశారంటూ బాధితుడు పేర్కొన్నాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు పవర్‌పేట రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం రైల్వే పట్టాలపై ఉందని ఏలూరు రైల్వే పోలీసులకు ఆదివారం రాత్రి సమాచారం అందింది. దీంతో రైల్వే ఎస్ఐ సైమన్ సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. ఏలూరు పవర్‌పేట రైల్వే స్టేషన్ సమీపంలోని చిట్టివలస పాకల వద్ద రైలు పట్టాలపై సుమారు 50 నుంచి 55 ఏళ్ళ వయసు ఉన్న వ్యక్తి మృతదేహం ఉంది. పట్టాలు దాటుతుంటే ప్రమాదవశాత్తు రైలు ఢీ కొన్నట్లుగా ప్రాథమికంగా భావిస్తున్నారు. 5.6 అడుగుల ఎత్తు కల్గి ఉన్నాడు. లేత ఆకు పచ్చ రంగు పొడవు చేతుల చొక్కా, ముక్కు పొడెం రంగు డ్రాయర్ కల్గి ఉన్నాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. వివరాలు తెలిసిన వారు ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్ నంబర్ 99892 195 59కు సమాచారం అందించాలని కోరారు.

మామిడి తోటలో మందు పార్టీ

ఆరుగురిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం మండలంలోని లక్కవరం గ్రామ శివారులోని ఓ మామిడితోటలో శనివారం అర్ధరాత్రి పార్టీ చేసుకుంటూ అల్లరి సృష్టిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో జంగారెడ్డిగూడెం సీఐ కృష్ణబాబు, లక్కవరం ఎస్సై శశాంక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేయగా మరో నలుగురు పరారీలో ఉన్నట్టు సీఐ తెలిపారు. వారి నుంచి 23 తెలంగాణ మద్యం సీసాలు (ఎన్‌డిపి), ఐదు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు పంపినట్లు సీఐ తెలిపారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదు

టి.నరసాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిని కొట్టి గాయపరిచిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు తెలిపారు. వీరభద్రవరం గ్రామానికి చెందిన దొప్పసాని చిన్న వెంకటేశ్వరరావు ఈనెల 17వ తేదీన దూడకు జాడు తెచ్చుకోవడానికి తన పొలం వద్దకు వెళుతుండగా అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు ఆస్తి గొడవల నేపథ్యంలో తలపై రాడ్‌తో కొట్టగా తీవ్రంగా గాయం అవడంతో జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్లో చేర్పించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో పోలీసులు కేసు నమోదు చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న భీమవరం డీఎస్పీ జయసూర్య.. స్వాధీనం చేసుకున్న ఆయుధాలు,ఫోన్లు

రొయ్యల వ్యాపారి కిడ్నాప్ కేసులో ఏడుగురి అరెస్టు

- పరారీలో ఐదుగురు
- ఆయుధాలు, ఫోన్లు స్వాధీనం
- నగదు లావాదేవీలే కారణం

భీమవరం క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ వద్ద ఈ నెల 16వ తేదీన కిడ్నాప్‌కు గురైన విశ్వనాథుని వెంకట సత్యనారాయణ (నాని) కేసును కొద్ది గంటల్లోనే ఛేదించి ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య తెలిపారు. ఆదివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన వెంకట సత్యనారాయణకు సోమిశెట్టి సత్యప్రసాద్, యిన్నమూరి లక్ష్మీ వెంకట మల్లికార్జున సురేష్‌బాబులకు ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. వెంకట సత్యనారాయణ కొందరి వద్ద డబ్బులు తీసుకుని అవి వేరే వ్యాపారస్తులకు ఇచ్చి కమీషన్ తీసుకునేవాడు. ఆ కోవలోనే పై ఇద్దరి నుంచే కాకుండా వారి బంధువుల వద్ద సుమారు 3 కోట్ల వరకు అప్పు తీసుకున్నాడు. ప్రతి మూడు నెలలకు ఒకసారి వడ్డీ ఇచ్చి తిరగ రాసేవాడు. కరోనా సమయం నుంచి వడ్డీగాని, అసలు గాని చెల్లించడం లేదు. దీంతో 2021 సంవత్సరంలో తిరగ రాయడంతో మొత్తం వడ్డీతో సహా రూ.10 కోట్ల 70 లక్షల వరకు ఇవ్వవలసి వచ్చింది. దీంతో సత్యప్రసాద్, సురేష్‌బాబులు డబ్బులు ఇవ్వమని ఒత్తిడి చెయ్యడం మొదలుపెట్టారు. డబ్బులు ఇవ్వకపోతే చంపుతామని కూడా బెదిరించారు. సత్యనారాయణ సమాధానం చెప్పకపోవడంతో ఎలాగైనా డబ్బులు రాబట్టాలని పన్నాగం పన్నారు.

కిడ్నాప్ ప్లాన్..

అనంతపురంలో సత్యప్రసాద్‌కు తెలిసిన కాకతీయ రెస్టారెంట్ యజమాని ఆశిష్‌తో ఈ విషయాన్ని తెలిపాడు. ఆశిష్ తనకు తెలిసిన లోకేష్ అనే వ్యక్తిని పరిచయం చేశాడు. లక్షల్లో డబ్బులు ఇస్తామని చెప్పడంతో లోకేష్ కిడ్నాప్‌కు ప్లాన్ వేశాడు. దీంతో కొంత మందిని కిడ్నాప్ చెయ్యడానికి పురమాయించాడు. రెండు కార్లలో ఈ నెల 15వ తేదీన భీమవరం వచ్చి రెక్కీ నిర్వహించారు. 16వ తేదీన వెంకట సత్యనారాయణ టౌన్ రైల్వే స్టేషన్‌కు రావడం చూసి కారులో వచ్చిన కొందరు సఫారీలో వచ్చి ఇంటిలిజెన్స్ పోలీసులమని సత్యనారాయణను కారులో తీసుకువెళ్ళారు. దీంతో బాధితుడి కుమారుడు సాయినాథ్ ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ కాళీచరణ్ దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ద్వారా వారు తీసుకువెళ్ళిన కారు అనంతపురం వెళ్ళిందని తెలుసుకుని అక్కడ పోలీసులను అలెర్ట్ చేశారు. అయితే వెంకట సత్యనారాయణను హత్య చేసి అయినా తమ డబ్బులు రాబట్టాలని సత్యప్రసాద్, సురేష్ బాబులు కిడ్నాపర్లకు చెప్పడంతో మారణాయుధాలు తీసుకువచ్చి హత్య చేస్తామని అనడంతో తనను భీమవరం తీసుకువెళితే తనకు ఉన్న ఆస్తిని అమ్మి అయినా డబ్బులు ఇచ్చేస్తానని చెప్పడంతో మూడు కార్లలో సత్యనారాయణను ఈనెల 18వ తేదీన భీమవరం తీసుకువచ్చారు. భీమవరం గరగపర్రు రోడ్‌లో ఖాళీ ప్రదేశంలో నిలబెట్టి వారందరూ చుట్టుముట్టి బెదిరిస్తూ ఉండటంతో పోలీసులు అక్కడకు వెళ్ళి ఏడుగురిని అరెస్ట్ చేశారు. మరో ఐదుగురు పరారీలో ఉన్నారు. వారి వద్ద ఉన్న మూడు కార్లు, తొమ్మిది ఫోన్లు, ఒక డైరీ, ఒక వాకీటాకీ, ఒక కత్తి, మూడు వికెట్లు, రెండు హాకీ స్టిక్కులు, ఒక ఆధార్ కార్డు స్వాధీనం చేసుకున్నారు. సీఐలు కాళీచరణ్, శ్రీనివాసరావు, నాగరాజు, ఎస్ఐలు రెహ్మాన్, ఇజ్రాయేల్, గోపి, నరేష్, గోవింద్‌రావు తదితరులు ఉన్నారు.

సంతోషపురం మాజీ సర్పంచ్‌ది హత్యే



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణ్

కైకలూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : పక్కా ప్రణాళిక ప్రకారమే సంతోషపురం మాజీ సర్పంచ్ హత్య జరిగినట్టు ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ స్పష్టం చేశారు. ఆదివారం కైకలూరు రూరల్ సర్కిల్ కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. కలిదిండి మండలం సంతోషపురం గ్రామ మాజీ సర్పంచ్ కాలవ నల్లయ్య(58) కలిదిండి గ్రామంలో నివాసం ఉంటున్నారు. స్వగ్రామంలో నల్లయ్యకు 15 ఎకరాల చేపలచెరువు ఉంది. అదే గ్రామానికి చెందిన బోదనపు శ్రీనివాసరావుతో చెరువు బోదె విషయంలో గొడవలు జరుగుతున్నాయి. నల్లయ్య వల్ల పదేపదే సమస్యలు తలెత్తడంతో హతమార్చాలని శ్రీనివాసరావు ప్రణాళిక సిద్ధం చేశాడు. ఈ నెల 16న నల్లయ్య బైక్‌పై చెరువు నుంచి కలిదిండి వస్తుండగా శ్రీనివాసరావు ఎదురుగా బైక్‌పై వచ్చి బలంగా ఢీ కొట్టాడు. నల్లయ్య కింద పడిపోవడంతో వెంట తెచ్చుకున్న ఇనుపరాడ్డుతో మెడపై కొట్టడమే కాకుండా కత్తితో పలుమార్లు దాడి చేసినట్టు డీఎస్పీ తెలిపారు. రక్తపు మడుగులో ఉన్న నల్లయ్యను స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు డీఎస్పీ తెలిపారు.పరారీలో ఉన్న శ్రీనివాసరావును ఆదివారం అదుపులోకి తీసుకున్నట్టు స్పష్టం చేశారు. కైకలూరు రూరల్ సీఐ వి.రవికుమార్, కలిదిండి ఎస్సై వి.వెంకటేశ్వరరావు ఉన్నారు.

నేటి నుంచి ఉచిత పశువైద్య శిబిరాలు

ఆకివీడు రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 20 నుంచి 31 వరకు ఉచిత పశు వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశువైద్యురాలు సత్యభార్గవి తెలిపారు. రోజుకో గ్రామంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తామని, మేకలు, గొర్రెల్లో నట్టల నివారణకు, పశువులలో జలగ నివారణకు మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అనారోగ్య పశువులకు చికిత్స చేస్తారని తెలిపారు. సోమవారం పెదకాపవరంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పాలకోడేరు: మండలంలో నేటి నుంచి 31వ తేదీ వరకు పశువులకు నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మండల పశు వైద్యాధికారిణి డాక్టర్ టి.హేమ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 8 నుంచి పెన్నాడపాలెంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

గాదిరాజు బాబుకు పితృ వియోగం


సోమరాజు (ఫైల్)

భీమవరం రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : డీఎన్ఆర్ కళాశాల అసోసియేషన్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్య నారాయణరాజు (బాబు) తండ్రి సోమరాజు (94) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈయన రోడ్లు భవనాల శాఖలో సుమారు 35 ఏళ్లు ఇంజనీర్‌గా పనిచేసి, 1989లో సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పదవీ విరమణ చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సోమరాజు పార్థివ దేహాన్ని రాజ్యసభ మాజీ సభ్యులు తోట సీతారామలక్ష్మి, డీఎన్ఆర్ అసోసియేషన్ అధ్యక్షుడు గోకరాజు వెంకట నర్సింహరాజు, ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, గోకరాజు రామరాజు, మెంటే పార్థసారధి, మెంటే గోపి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

రేలంగి గ్రామ టీడీపీ అధ్యక్షుడు భాస్కరరావు మృతి



ఇరగవరం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఇరగవరం మండలం రేలంగి గ్రామ టీడీపీ అధ్యక్షుడు మానే భాస్కరరావు ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. భాస్కరరావు భౌతిక కాయాన్ని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇరగవరం మండల టీడీపీ అధ్యక్షుడు గోపిశెట్టి రామకృష్ణ, అత్తిలి మండల అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుక్కా సాయిబాబు, పార్టీ కార్యదర్శి కామన రాంబాబు, యువత అధ్యక్షులు గూడూరి నాగరాజు తదితరులు సంతాపం తెలిపారు.

అత్తిలి లయన్స్ క్లబ్‌కు అవార్డులు

అత్తిలి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నరసాపురంలో జరిగిన లయన్స్ రీజనల్ మీట్‌లో అత్తిలి లయన్స్ క్లబ్‌కు పలు అవార్డులు వచ్చినట్టు క్యాలెండరు ఆఫ్ ఈవెంట్స్ జిల్లా చైర్మన్ యాతం రాంబాబు తెలిపారు. 3వ ఉత్తమ కార్యదర్శిగా సీతాల వెంకట నారాయణ, మొదటి ఉత్తమ కోశాధికారిగా బండి గంగాధర్, ఉత్తమ ప్రశంసా అవార్డు అధ్యక్షుడు సింగులూరి చంద్రశేఖర్ ఎంపికైనట్లు తెలిపారు. ప్రాంతీయ అవుట్ స్టాండర్డ్ లయన్స్ సభ్యుడిగా యాతం రాంబాబు ఎంపికయ్యారు.

హీరో వరుణ్ తేజ్ పుట్టిన రోజు వేడుకలు

భీమవరంటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : భీమవరం పట్టణం మెగా ఫ్యాన్స్ ఆధ్వర్యంలో సినీ హీరో వరుణ్ తేజ్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆదివారం బజార్‌లో ఉండపల్లి కాంప్లెక్స్‌లో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. రాష్ట్ర చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు ఉండపల్లి రమేష్ నాయుడు భీమవరం మెగా ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షుడు చల్లా రాము తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సహాయకులను చేర్చుకోవాలి

భీమవరం టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : కోర్టు తీర్పును అమలు చేసి తమకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీ.వీ.ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంలో ఎవ్వరికీ ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో పనిచేసే కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. సోమసుందర్ డిమాండ్ చేశారు. ఆదివారం సిపాయిపేట భవన నిర్మాణ కార్మిక సంఘ కార్యాలయంలో జరిగిన ప్రాంతీయ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సమావేశం లో ఆయన మాట్లాడుతూ వేతనాలు పెంచి కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు తాడేపల్లి సుబ్బరాజు, ఏఐటీయుసి ఏరియా కార్యదర్శి ఓసూరి వీర్రాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు.

50 ఏళ్ల క్రితం కలిసి చదివారు..


సంబరాల్లో పూర్వ విద్యార్థులు

నరసాపురం రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏరా ఎలా ఉన్నావ్. బాగున్నావా.. ఎన్నాళ్లయిందిరా నిన్ను చూసి.. ఎంత మారిపోయావురా అంటూ ఆత్మీయంగా ఒకరినొకరు పలకరించుకున్నారు. 50 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న వారంతా ఆదివారం నాడు నరసాపురం మండలం సీతారాంపురం సొసైటీ కళ్యాణ మండపంలో కలిశారు. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. గ్రామంలోని సమితి ప్రైమరీ స్కూల్‌లో 1967-1974 మధ్య కాలంలో చదివిన విద్యార్థులు చదువు పూర్తయిన తరువాత వేర్వేరు ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడ్డారు. సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపి కేక్ కట్ చేశారు. కాంతాజీ, చినమిల్లి వెంకట్రావు, జెర్మియ, మద్దాల వెంకటేశ్వరరావు, సత్తిబాబు, మరియమ్మ, రత్నవేణి, ఆరవేంద్ర, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును కాపాడిన చంద్రబాబు : నిమ్మల



యలమంచిలి/పాలకొల్లు అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ప్రైవేటు పరం కాకుండా కాపాడిన ఘనత చంద్రబాబుదని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. యలమంచిలి మండలం చింతదిబ్బ, ఇలపకుర్రు, అబ్బిరాజుపాలెం, లక్ష్మీపాలెం, యలమంచిలి లంక గ్రామాల్లో రూ.1.50కోట్లతో నిర్మించనున్న సీసీ రహదారులు, డ్రైన్‌లు, పలు అభివృద్ధి పనులకు మంత్రి ఆదివారం శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాష్ట్రంలో కుంటుపడిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను నేడు ఎన్డీఏ ప్రభుత్వంలో వేగవంతం చేశామన్నారు. హామీలను ఆరు నెలల పాలనలో ఒక్కొక్కటి అమలు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీని రూ.16 వేలకు తగ్గించగా తమ ప్రభుత్వం రూ.25 వేలకు పెంచిందన్నారు. మామిడిశెట్టి పెద్దిరాజు, ముచ్చర్ల శ్రీనివాస్, కడలి గోపి, మాతా రత్నంరాజు, ఆరుమిల్లి చిన్ని, చిట్టూరి ఆంజనేయులు, కొండేటి జీవరత్నం, చల్లా నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను మంత్రి నిమ్మల ఆదివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సంఘం ఐక్యంగా ఉండాలన్నారు. దేవాంగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వట్టం గణేష్, కోశాధికారి అల్లాడ కుమార స్వామి, సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మానెం బసవ రాజు తదితరులు పాల్గొన్నారు.

వేమన పద్యాలు ముందు తరాలకు తెలపాలి: ఆరిమిల్లి

అత్తిలి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మూఢాచారాలను విడనాడి కులమతాలకతీతంగా అందరూ సోదరభావంతో మెలగాలని వేమన ఉద్బోధించారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆరవల్లిలో జరిగిన యోగి వేమన శతజయంతి ఉత్సవాలలో ఆయన పాల్గొన్నారు. వేమన పద్యాలను ముందుతరాల వారు చదివేలా ప్రోత్సహించాలన్నారు. ఆరవల్లి గ్రామం వెంబడి రోడ్లు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. వంద సంవత్సరాలుగా ఉత్సవాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆరిమిల్లి అభినందించారు. సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ వేమన గొప్పతనం గుర్తించడం వల్లే వంద సంవత్సరాలుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు. నిర్మాత కొవ్వూరి అచ్చిరెడ్డి, రెడ్డి అండ్ రెడ్డి గ్రూప్స్ చైర్మన్ గొలుగూరి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పిల్లల్లో కార్యదీక్షను పెంపొందించాలన్నారు. కబడ్డీ పోటీల్లో ప్రథమ బహుమతినీ ఉండి జట్టు, ద్వితీయ బహుమతిని జంగారెడ్డిగూడెం, తృతీయ బహుమతిని అనంతపల్లి, 4,5 స్థానాలు పీఎం లంక, తణుకు జట్టు పొందాయి. విజేతలకు ఆరిమిల్లి బహుమతులు అందజేశారు. ఆరవల్లి వేమన జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, సర్పంచ్ సుస్మిత తదితరులు మాట్లాడారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

తల్లిదండ్రులను ఆదరించాలి



ఆకివీడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వృద్ధులను ఆదరించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్ అన్నారు. సర ఆర్థర్ కాటన్ మండల సీనియర్ వెల్ఫేర్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక లయన్స్ కార్యాలయంలో మాజీ జడ్పీటీసీ అజ్మల్ స్మృత్యర్థం పల్స్ హాస్పటల్ నిర్వహకులు డాక్టర్స్ బిలాల్, నిలోఫర్ ఆర్థిక సహకారంతో 120 మంది పేదలకు దుప్పట్లు, భోజనం, వాటర్ ప్యాకెట్స్ అందచేసి, వృద్ధుల చట్టంపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు పిల్లలకు ఆస్తి రాసిన తరువాత వారి బాగోగులు చూసుకోకుంటే హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం రద్దు చేసుకొనే అధికారం ఉందన్నారు. సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎంవీఎస్ రాజు, అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య, ప్రముఖులు కలిదిండి పాండురంగరాజు, అప్పిరెడ్డి, గొంట్లా సత్యనారాయణ, అడవి సుబ్బారావు, రాజు, జక్కీ తదితరులు ఉన్నారు.


కేంద్ర మంత్రి అమిత్ షాను సత్కరిస్తున్న ఆరిమిల్లి, పాండువ్వ శ్రీను

అమిత్ షా కు సత్కారం

తణుకు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఆర్‌ఎఫ్ వేడుకలకు విచ్చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కలసి సత్కరించారు. ఆదివారం గన్నవరం ఎయిర్ పోర్టులో కూటమి నాయకులతో సహా కలిశారు.

ఉండి : అమిత్‌షాను మాజీ ఎమ్మెల్సీ పాండువ్వ శ్రీను సత్కరించారు. విజయవాడ విచ్చేసిన అమిత్‌షాకు పాండువ్వ శ్రీనుని సీఎం చంద్రబాబునాయుడు పరిచయం చేసారు. దాంతో అమిత్‌షాకు పూలమాల ఇచ్చి శాలువాను కప్పి సత్కరించారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి


వాహనాలకు రేడియం స్టిక్కర్లు అంటిస్తున్న దృశ్యం

భీమవరంక్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని రవాణా శాఖ అధికారులు సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా ఆదివారం భీమవరంలో రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని రవాణా శాఖ అధికారులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భీమవరం రవాణా కార్యాలయానికి చెందిన పలువురు రవాణా తనిఖీ అధికారులు పాల్గొని వాహనదారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. నాలుగు చక్రాల వాహన డ్రైవరు తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకోవాలని వాహనాలకు ఇన్సూరెన్స్, పొల్యూషన్ రిజిస్ట్రేషన్ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. వాహనాలు నడిపే సమయాలలో సెల్‌ఫోన్ మాట్లాడి రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండా లని వారు సూచించారు. వాహనం ముందు, వెనుక భాగాల్లో రేడియం స్టిక్కర్స్ లేని వాహనాలకు వాటిని అంటించారు. రవాణా తనిఖీ అధికారులు కే. ప్రసాద్, ఎం. రవికుమార్, లక్ష్మి, తేజ, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల డిజైన్లు ఇవ్వండి : జేసీ



భీమవరం టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : భీమవరం పట్టణంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల డిజైన్లను త్వరితగతిన పూర్తి చేసి అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మున్సిపల్ సర్వేయర్లను ఆదేశించారు. ఆదివారం ఆయన ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల, ఆర్టీసీ డిపో వద్ద బస్టాప్‌ల నిర్మాణాలకు స్థలాలను పరిశీలించారు. అనంతరం హౌసింగ్ బోర్డు లోని కళావేదిక పార్కు అభివృద్ధి పనులను పరిశీలించి సూచనలిచ్చారు. ఓల్డ్ బస్టాండ్ పునఃనిర్మాణానికి వెంటనే డిజైన్ లను రూపొందించి నిర్మాణ దాతకు అందజేయాలని భీమవరం ఆర్టీసీ డిపో మేనేజర్‌ను ఆదేశించారు. మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, ఆర్టీసి డిపో మేనేజర్ పి ఎస్ వి ఎం సత్యనారాయణమూర్తి, మునిసిపల్ ఇంజనీర్ త్రినాధ రావు, ఐఎంఏ ప్రతినిధి సిహెచ్ కృష్ణంరాజు, సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా గో బ్యాక్.. సీపీఎం నాయకుల నిరసన

భీమవరం అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో భీమవరం అంబేడ్కర్ సెంటర్ వద్ద అమిత్‌షా గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు చింతకాయల బాబూరావు అధ్యక్షతన ఆదివారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. వామపక్ష పార్టీల ఆందోళనకు దళిత సంఘాలు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానపర్చిన అమిత్ షాకు రాష్ట్రంలో అడుగుపెట్టే హక్కులేదని అన్నారు. పార్లమెంట్ సాక్షిగా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సిపిఐ ఏరియా కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, దళిత ఐక్యవేదిక గంటా సుందర్‌కుమార్, ఏపి బహుజన జేఏసి నాయకుడు బిరుదుగడ్డ రమేష్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. క్రాంతిబాబు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, మామిడిశెట్టి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరం: అమిత్ షా గో బ్యాక్ అంటూ సీపీఎం నాయకులు ఆది వారం ఇరగవరం లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అంబేడ్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పాలని లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు పిల్లి కోటేశ్వరరావు, జక్కంశెట్టి గంగాధర రావు, తూరుగోపుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని అలవర్చుకోవాలి


అచ్యుత కుమార్‌ను సత్కరిస్తున్న భోగేశ్వరరావు

పెంటపాడు, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చిన్ననాటి నుంచే దేశభక్తి ని అలవర్చుకోవాలని నైనిటాల్ నుంచి విచ్చేసిన భారతీయ వాయుసేన గ్రూప్ విశ్రాంత కెప్టెన్ అచ్యుత్‌కుమార్ అన్నారు. అలంపురం టీబీఆర్ డిఫెన్స్ అకాడమీని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. డిఫెన్ అకాడమి ఏర్పాటు చేసి విద్యార్థుల్లో దేశభక్తిని నింపుతున్న టీబీఆర్ గ్రూప్ చైర్మన్ తనుబుద్ది భోగేశ్వర రావును అభి నందించారు. కరస్పాండెంట్ పద్మావతి, సీఈవో రవికిరణ్, ప్రిన్సిపాల్ కళ్యాణి, ఏవో నాగరాజు పాల్గొన్నారు.

దైవ చింతనతో ప్రశాంత జీవనం : మాతాజీ


మాతాజీ ఆశీర్వచనాలు అందుకుంటున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): దైవచింతనతోనే ప్రశాంత జీవనం సాధ్యమవుతుందని యోగిని శ్రీ చంద్రకాళీ ప్రసాద మాతాజీ అన్నారు. త్యాగరాజ భవనంలో గత మూడు రోజులుగా శ్రీ బాబు భక్త సమాజ్ భీమవరం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సత్సంగ సమావేశాల్లో మాతాజీ వారి దివ్య బోధామృతం, శ్రీ శ్రీనివాస రామానుజ దాసు ప్రవచనం చేశారు. సామూహిక కుంకుమ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్త సమాజ్ భీమవరం శాఖ సభ్యులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే అంజిబాబు మాతాజీ ఆశీర్వచనాలు అందుకున్నారు.

మావుళ్ళమ్మను దర్శించుకున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి



భీమవరం టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మవారిని ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ గోపిమూర్తి ఆదివారం కుటుంబంతో సహా దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం అధికారులు స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ అమ్మవారి శేష వస్త్రం ప్రసాదం అందించారు.

కొండాలమ్మకు 101 చీరల సమర్పణ



తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలో కొండాలమ్మ వారికి జనసైనికుడు కోట సత్తులు 101 చీరలు సమర్పించి ఆదివారం మొక్కు తీర్చుకున్నాడు. ఎమ్మెల్యేగా బొలిశెట్టి శ్రీనివాస్ విజయం సాధించాలని మొక్కుకుని ఆ మేరకు జనసేన మండలాధ్యక్షుడు అడపా ప్రసాద్ చేతుల మీదుగా అమ్మవారికి చీరలు సమర్పించాడు. టీడీపీ సీనియర్ నాయకుడు బాలం కృష్ణ, జనసేన మండల కార్యదర్శి పల్లంట్ల సత్తిబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులకు టీడీపీ నాయకుడు దుప్పట్ల వితరణ

పెంటపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి గొప్పదనాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఎన్టీఆర్ అని మాజీ ఎంపీటీసీ, టీడీపీ నాయకుడు దాసరి సతీష్‌కుమార్ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని పెంటపాడు పంచాయతీ కార్యాలయం వద్ద వృద్ధులకు, పంచాయతీ కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. నక్కా సాంబశివరావు, పీబీ శ్రీనివాసాచార్యులు, శనగన శ్రీనివాస్, దాసరి సత్యనారాయణ, చీపుర్ల సాంబశివరావు, బొద్దూరి భాస్కరరావు, బంటుమిల్లి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

జాతరలు.. పూజలు



పాలకోడేరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గొల్లలకోడేరు గ్రామంలో బరికలమ్మ జాతరను పురస్కరించుకుని ఆదివారం ఆలయం వద్ద బల్లల పూజ పండుగను రజక సంఘస్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. కుల వృత్తిని కాపాడాలని, రజకులంతా ఆయురారోగ్యాలతో జీవించేలా చూడాలని బల్లల పండుగను నిర్వహించారు. సంఘస్తులు సంబలదీవి వీరాస్వామి, వెంకటేశ్వరరావు, ప్రసాద్, నేదునూరి సుబ్బారావు, చిన వెంకన్న, గణేష్, దుర్గారావు, మహిళలు పాల్గొన్నారు.

రూ. 25 వేలు పలికిన అమ్మవారి లడ్డూ ప్రసాదం

మొగల్తూరు: పేరుపాలెంలోని మొగదారమ్మ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అన్నసమారాధన జరిగింది. సత్తినేని రామకృష్ణ సత్యవతి దంపతులు 18 కిలోల లడ్డును అమ్మవారికి సమర్పించారు. సత్తినేని గణేష్ కుమారుడు తేజ రూ.25 వేలకు వేలంలో లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నాడు.

● మొగల్తూరు గ్రామ ప్రజల ఆరాధ్యదేవత నడివీధి ముత్యాలమ్మ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన గురుజు వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: కొత్తూరు కోట్లమ్మ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి గరగలకు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామస్థులు నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారికి జనసేన మండలాధ్యక్షుడు అడపా ప్రసాద్, గ్రామ అధ్యక్షుడు సత్యనారాయణ, ఎంపీటీసీ నరసింహమూర్తి, జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీరవాసరం/భీమవరం టౌన్: సంప్రదాయాలకు అనుగుణంగా వెంకమ్మ జాతర నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. వీరవాసరం మండలం దూసనపూడిలో శ్రీసవరం పద్దాల వెంకమ్మ వార్షిక మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకోగా ఆయనను ఘనంగా సత్కరించారు.

భీమవరం టౌన్: భీమవరం, గునుపూడి గ్రామదేవతలు ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ వార్లకు రజక యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే 34వ జాతర మహోత్సవం ఆదివారం అమ్మవారి గ్రామోత్సవంతో వైభవంగా ప్రారంభమైంది. రజక కుటుంబాల వారు అమ్మవారికి మహానివేదన చేశారు. అందించి అమ్మవారిని దర్శించుకున్నారు.

గణపవరం: ఎస్.కొండేపాడులో ఎలకమ్మ జాతర వైభవంగా జరిగింది. అమ్మవారిని గరగనృత్యాలు, బ్యాండ్‌మేళలతో తెల్లవార్లు ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం నైవేద్యాలు సమర్పించారు.

నరసాపురం టౌన్: పట్టణంలోని చినమామిడిపల్లిలో నాగారమ్మ జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. బాణసంచా కాల్పులు, గరగనృత్యాలతో ఊరేగింపు జరిగింది. భక్తులు పెద్దయెత్తున్న పాల్గొన్నారు.

ఆకివీడు రూరల్: నందమిల్లిపాడులో మర్లమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. సర్పంచ్, ఉపసర్పంచ్‌లు చిట్టిబాబు, నారాయణరాజు, తిమ్మరాజు, నిర్వాహకులు చినిమిల్లిపెంటయ్య, వెంకన్నబాబు, శివన్నారాయణ, రాజు, బంద్రెడ్డి నాగరాజు బలే రాంబాబు పాల్గొన్నారు.

ఆకివీడు: దేవతలను భక్తితో పూజిస్తే అమ్మవార్ల కృపకు పాత్రులం కాగలమని దానేశ్వరమ్మ ఆలయ చైర్మన్ బండారు జలదుర్గ ప్రసాద్ అన్నారు. స్థానిక కాపవరం రోడ్‌లోని దానేశ్వరమ్మ వార్షిక మహోత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం అమ్మవారికి అభిషేకం, రాత్రి భక్తులు వెయ్యి కిలోలు పసుపు, కుంకుమను ఊరేగింపుగా తీసుకెళ్ళి ప్రత్యేక పూజలు, అర్చన నిర్వహించారు.



నిధుల విడుదలపై హర్షం

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారానికి నిధులు విడుదల చేయడం అభినందనీయమని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ హర్షం వ్యక్తం చేశారు. తాడేపల్లిగూడెంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఉక్కుకు మరింత ప్రోత్సాహం అందించాలన్నారు. బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్ నరిసే సోమేశ్వరరావు తదితరులు మాట్లాడారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆర్టీవో నాయక్ సూచించారు. తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో వద్ద ఆదివారం డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో ఆర్టీసీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు తీసుకోవాల్సిన ట్రాఫిక్ నిబంధనలు వివరించారు.

క్వారీ లారీ డ్రైవర్ల అర్ధనగ్న ప్రదర్శన

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన కోర్కెలు తీర్చకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని క్వారీ లారీ యూనియన్ డ్రైవర్లు హెచ్చరించారు. నవాబుపాలెంలో శనివారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. సంఘ అధ్యక్షుడు ఉండ్రాజవరపు యేసురత్నం, సెక్రటరీ దొండపాటి శేషుకుమార్, కోశాధికారి మార్లపూడి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సంచార శకటంతో ఉచిత వైద్య సేవలు

తణుకు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా సంచార శకటం ద్వారా ఆదివారం వైద్య సేవలు నిర్వహించారు. నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ నీలి మహేంద్ర తణుకు, సజ్జాపురంలో పర్యటించి ఆరుగురు వృద్ధులకు వైద్య సేవలు అందించారు. సంఘ సభ్యులు పాతూరి శివన్నారాయణ ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి, గిరజాల నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ షాపు దరఖాస్తుదారులకు పరీక్షలు

నరసాపురం టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 20 రేషన్ దుకాణాలకు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశారు. ఎంపికలో భాగంగా ఆదివారం వైఎన్ కాలేజీలో రాత పరీక్షలు నిర్వహించగా 57 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని ఆర్డీవో దాసిరాజు సందర్శించారు.

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్ పరిధిలో రేషన్ దుకాణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆదివారం తాడేపల్లిగూడెం జడ్పీ హైస్కూల్‌లో రాత పరీక్షలు నిర్వహించారు. ఆర్డీవో కౌసర్ బానో, తహసీల్దార్ ఎం సునీల్ కుమార్ పర్యవేక్షించారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

నరసాపురం టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గంటాలమ్మ ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో సుమారు 60 మంది మహిళలు పాల్గొన్నారు. చిన్నారులకు పాటల పోటీలు నిర్వహించి విజేతలకు కమిటీ తరపున బహుమతులు అందించారు. కౌన్సిలర్ పతివాడ పద్మ మార్కండేయులు, సముద్రాల రాజ్యలక్ష్మి, నాగరత్నం పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సూర్యహోమం

పాలకొల్లు అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం, కరోనా ఇతర వైరస్‌ల అంతానికి స్థానిక కోడిగట్టున ఉన్న శ్రీ సరస్వతి శిశు మందిరంలో ఆదివారం 258వ సూర్యహోమం నిర్వహించారు. కరోనా ప్రారంభమైనప్పటి నుంచి క్రమం తప్పకుండా ప్రతి ఆదివారం నిర్వహించే ఈ సూర్యహోమం 258వది అని నిర్వాహకులు తెలిపారు. కేవీఎస్ఎన్ నరసింహరాజు, భాస్కరరావు, కిరణ్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన